కథ

# క్లినిక్కా - మజాకా

**డా. పేరాల శ్రావణ్ కుమార్**

క్లినిక్ పెట్టడానికి వైజాగ్ అంతా గాలించి గాలించి చివరాఖరిగా హనుమంతవాక ఏరియాలోకి ఉరికింది డా.శ్రావణ్ హీరోహోండా. సింహం మెడికల్స్ అండ్ జనరల్స్ దగ్గర బండాపి, హెల్మెట్‌లో ఆమ్లెట్‌లా ఉడికిపోతున్న బుర్రని బైటికి పీక్కుంటూ ''ఓ కూల్ డ్రింక్ ఇవ్వండి'' అలసటా అన్నాడు డా.శ్రావణ్.

''ఒరేయ్ శ్రావణ్ నువ్వా!'' కౌంటర్ లోంచి కూల్‌డ్రింక్ బాటిల్‌తో సహా ఆంజనేయుళ్లా దూకేడు సింహాచలకుమార్. ఇద్దరూ టెన్త్ దాకా దుంపలబళ్లో కలిసి చదివేరు. ఆ తర్వాతే అడ్రసుల్లేవు.

''నువ్వట్రా సింహం!'' సింహాన్ని తిలకించి పులకించి పోతూనే డ్రింక్ బాటిల్ ఖాళీ చేశాడు శ్రావణ్. ''నువ్వెప్పుడు మెడికల్ షాప్ పెట్టేవురా?'' లోపలికి నడుస్తూ అడిగేడు శ్రావణ్.

''మనమెందుకు పెడతాం. ఫ్రీ ఆఫర్‌లో ఒచ్చింది'' వాడంతే. ఫ్రీ ఆఫరుంటేగానీ ఏ వస్తువూ కొనేవాడు కాడు చిన్నప్పట్నించీ.

''ఆఫరంటే!'' కుర్చీలో సెటిలవుతూ అడిగేడు అర్థంకాక శ్రావణ్.

''అదేరా! తన కూతుర్ని భరిస్తున్నందుకు మా మాంగారిచ్చిన ఫ్రీ ఆఫర్'' నవ్వేడు సింహం.

''ఇంతకీ నీ ఎంబీబీయస్ ఎందాకా వచ్చింది? మన రాజుగాడు చెప్పేడు నువ్వు డాక్టరు చదువుతున్నావనీ!'' ఫ్రెండ్‌ని నిండుగా చూస్కుంటూ అన్నాడు సింహం.

''ఐపోయిందిరా. అందుకేగా రోడ్డున పడ్డాను'' అంటూ ఊళ్లో ఉన్న కాంపిటీషన్ గురించీ పోనీ రిస్క్ తీస్కుని ప్రాక్టీస్ పెడదామన్నా అదిరిపోతున్న రెంట్లూ, అడ్వాన్సుల గురించీ వాపోయేడు బాల్యమిత్రుడి దగ్గర.

''పోన్లేరా. ఆఖరికి మంచి ప్లేస్‌కే వొచ్చేవులే. ఈ ఏరియాలో సరైన డాక్టరు ఒక్కడూ లేడు. ఇక్కడ పెట్టావంటే రోరింగ్ ప్రాక్టీసే నీకు!'' ఆప్టిమిజం, డైనమిజం కలిపితే సింహం గాడి నైజం.

''నీ దగ్గర మొహమాటం ఎందుగ్గానీ వేలకి వేల ఎడ్వాన్సులూ, రెంట్లూ నేనివ్వలేన్రా!'' నిరాశగా అన్నాడు శ్రావణ్. అతనిది మిడిల్‌క్లాస్ బ్యాక్‌గ్రౌండ్.

కాస్సేపు దీర్ఘంగా ఆలోచించేడు సింహం. అనంతరం కళ్లూ, నోరూ ఒకేసారి విప్పేడు. ''పక్కనే ఓ షాపు ఖాళీగా ఉంది. దాని ఓనర్ మా గురూగారే. పీనాసి వాడే అనుకో. అయినా ఏదో చెప్పి ఎడ్వాన్స్ లేకుండా చేస్తా. క్లినిక్ రెంటు కూడా బాగా తగ్గేలా చేస్తాగా. నీకెందుకు ఓ మంచిరోజు చూసి నువ్వు దిగిపో''

ఓ మంచిరోజు ఉదయం తొమ్మిదికల్లా వ్యాన్‌లో సామాన్లతో సహా దిగిపోయేడు డా.శ్రావణ్.

సింహంతోబాటే వాకిట్లోనే ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు లూజు పైజమా, కళ్లీలాల్చీల్లో ఓ భారీ అవతారం.

''ఈయనే అవతారంగారు. మీ క్లినిక్ ఓనర్ గారు'' పరిచయం చేశాడు సింహం. భక్తిగా నమస్కారం చేశాడు శ్రావణ్. రెంటు, అడ్వాన్సు, ఊసెత్తగానే అలిగి మాటలు మానేసి ఓ మూల కూర్చున్న అవతారాన్ని బుజ్జగించేసరికి తాతలు దిగొచ్చారు సింహానికి. ''ఒరే! వాటి మాటే ఎత్తకురా. సార్ అలక తీర్చలేక నేను చావాలి'' ఇబ్బందిగా అన్నాడు సింహం.

''లేకపోతే ఏటి బాబూ! నాకసలే డాక్టర్లంటే వల్లమాలిన ప్రేమ. అసలు నేనే డాక్టరైపోవాలని కలలు కనేటోన్ని చిన్నప్పుడు. పరిత్తితుల వల్ల ఐదోక్లాసుతో ఆపేసి బియ్యం యాపారంలో కూరుకుపోవాల్సొచ్చింది'' శ్రావణ్‌ని మేడ మీద తనింట్లోకి తీస్కెళ్తూ అన్నాడు అవతారంగారు.

'ఐదో క్లాస్ లోపలే తొందరపడిపోయి అన్ని కలలెందుకు కనేశాడో' అనుకున్నాడు శ్రావణ్.

''ఒసేవ్! డాక్టరుగారొచ్చేరు. కాస్త ఇలా వొస్తేవా?'' హాల్లోంచి కేకేశాడు అవతారం.

''అలాగే'' అంటూ 'కాస్త ఇలా వొచ్చిన' వొసేవ్‌గారు శ్రావణ్‌ని చూస్తూనే మొహం చోళాపూరీ అంత చేస్కున్నారు.

''అది క్లినిక్ కాదు మీ ఇల్లే అనుకోబాబూ!'' ప్లేట్లో వేడివేడి గారెలు, కొబ్బరి చెట్నీతో సహా అందిస్తూ ఆవిడ ఆప్యాయంగా అంటుంటే శ్రావణ్ కళ్లల్లోంచి ఆనందభాష్పాలు చెట్నీలో పడి గట్టి చెట్నీ కాస్తా నీళ్లచెట్నీ అయింది.

ఇంతలో ఓ సిసింద్రీ...గోలగా అరుస్తూ పరిగెట్టుకుంటూ వొచ్చి శ్రావణ్ వెనకాల దాక్కుని అతని కాళ్లు చుట్టేశాడు. ''ఒద్దక్కా! ప్లీజ్! కొట్టద్దు'' అల్లరిగా నవ్వుతున్నాడు.

''ఏరా! నీ ఎంగిలి ప్లేటు నేను తియ్యాలా! నేనేమన్నా పనిపిల్లనా! ఛంపేస్తా'' ఓ ఇరవై ఏళ్లమ్మాయి వాడిని వెంటాడుతూ కొత్తమనిషిని చూసి తడబడ్డట్టయింది.

''వీళ్లే మా అమ్మాయి శశిరేఖా, ఏకైక పుత్రుడు బబ్లూ.. ఏజ్ గ్యాపు ఎక్కువే ఐనా చిన్నపిల్లల్లాగే పోట్లాడుతుంది వాడితో'' కూతుర్ని ముద్దుగా విసుక్కున్నాడు అవతారం.

''ఏం చదూతున్నావ్ శశిరేఖా?'' పలకరింపుగా అన్నాడు శ్రావణ్.

''ఫస్ట్ ఇంటర్ కోర్స్ అయిపోయి సెకండ్ ఇంటర్ కోర్స్ సగంలో ఉండగా డాడీ మాన్పించేశారు!'' జడ ముందుకేస్కుని శశి వగలుపోతూ చెప్తుంటే సిగ్గుతో చితికిపోయేడు డా.శ్రావణ్. భార్యాభర్తల కలయికనే ఇంటర్ కోర్స్ అంటారని ఈ పిల్లకి తెలీదు కాబోలు.

''ఇంటర్ కోర్స్ అనకూడదు. ఇంటర్మీడియట్ కోర్స్ అనాలి''

''ఏం! ఎందుకని?'' మొండిగా అడిగింది శశిరేఖ.

''ఆ మాటకి చాలా తప్పర్థం వస్తుంది'' కొంప దీసి చెప్పమంటుందా ఏంటి ఖర్మ అనుకుంటూ అన్నాడు.

ఇంతలో సింహం ''పూజకి టైం అవుతుంది రారా!'' అని లాక్కుపోయాడు కాబట్టి సరిపోయింది.


క్లినిక్ ప్రారంభోత్సవం నిరాడంబరంగా పూజా కార్యక్రమంతో మొదలైంది. మొదటి పేషెంటుగా అవతారంగారు బీపీ చూపించుకుని ఒద్దంటున్నా వంద రూపాయలు ఫీజుగా ఇచ్చేరు. శశిరేఖ అల్లరి చేసి మరీ తనూ బీపీ చూపించుకుంది.

బబ్లూగాడు టేబిలు మీద వస్తువులు సవరిస్తూ తన వంతు ధర్మంగా 'ధర్మామీటరు' పగలగొట్టి జారుకున్నాడు.

పేషెంట్లు లేరు గానీ సాయంత్రం దాకా అవతారంగారితోనే సరిపోయింది. తనకున్న ఆస్తిపాస్తుల వివరాలన్నీ చెప్పి బోరెత్తించేశాడు. ఆయన అలా

వెళ్లగానే 'ఒసేవ్' గారూ వచ్చేరు. కూతురి సుగుణాలూ, వంటల్లో నేర్పరితనం గురించీ కథలు కథలుగా చెప్పుకొచ్చేరు. 'ఖాళీగా ఉన్నానని రోజూ ఇలా వరసపెట్టి వాయిస్తారేమో రా భగవంతుడా' క్లినిక్ మూసి ఆ రాత్రి ఎం.వి.పి.కాలనీలోని తనింటికెళ్తూ అనుకున్నాడు శ్రావణ్.

మర్నాడు ఉదయం ఠంచనుగా తొమ్మిదికల్లా క్లినిక్ ఓపెన్ చేశాడు. మధ్యాహ్నం దాకా పేషెంట్స్ నిల్. 'ఏంటో ఈ సింహంగాడు రోరింగ్ ప్రాక్టీసన్నాడు. బోరింగ్ ప్రాక్టీసులా ఉంది వ్యవహారం. దేవుడా! ఒక్క పేషెంట్‌నన్నా పంపవయ్యా!' గోడ మీది ఏడుకొండల వాడి పటాన్ని ఇలా వేడుకున్నాడో లేదో బయట ధబ్బుమని ఏదో చప్పుడూ, ఓ స్త్రీ ఆర్తనాదం... హడావిడిగా బైటికొచ్చేడు శ్రావణ్.



క్లినిక్ ముందర రోడ్డు మీద మూలుగుతూ పడి ఉందో ముసలావిడ. అరవై ఏళ్లుంటాయేమో. గంధం రంగు జరీ చీర, నుదుట తీర్చిదిద్దిన తిరునామం, బాపూ గీసిన బామ్మగారి బొమ్మలా ఉందావిడ. ముగ్గుబుట్ట లాంటి ఆవిడ తల నుండి ధారగా కారుతోంది రక్తం. చుట్టుపక్కల జనం తలో చెయ్యా వేసి ఆవిణ్ని క్లినిక్‌లో బల్లమీదకి చేర్చారు. ఆవిడ తెలివిలో లేదు. ఆవిడ వెంటే ''బామ్మా...బామ్మా...'' అంటూ గుక్కపట్టి ఏడుస్తూ ఓ ఏడేళ్ల నానిగాడు. జనం కబుర్లని బట్టి సీనర్థమైంది శ్రావణ్‌కి. మనవడితో కలిసి ఆటోలో ఎక్కడికో వెళ్తున్న బామ్మగారు, ఆటోవాడు ర్యాష్‌గా టర్నింగ్ తిప్పడంతో పట్టు తప్పి ధామ్మంటూ కింద పడిపోయేరు. జనంతో బాటు వచ్చి భయం భయంగా ఓ మూల నిలబడి ఉన్నాడు ఇరవై ఏళ్లున్న అనుభవం లేని ఆ ఆటోవాలా.

శ్రావణ్‌లోని డాక్టర్ ఒక్కసారిగా జూలు విదిలించేడు. చకచకా రక్తస్రావం అరికట్టే ప్రయత్నంలో పడ్డాడు. జనం చుట్టూ మూగి తలో సలహా ఇస్తున్నారు.

ఇంతలో సింహం పరుగెట్టుకుంటూ వచ్చాడు జనాన్ని చూసి. ''ఒరేయ్ శ్రావణ్! ఆటో ఏక్సిడెంట్‌లా ఉంది. పోలీసు కేసవుతుందేమో. తర్వాత కోర్టుల చుట్టూ తిరగాలి. ఎందుకురా ఈ కేసు టేకప్ చేశావ్?'' అన్నాడు కంగారుగా.

''అవన్నీ తరవాత పేషెంట్‌కి రక్తంపోతూ ప్రాణాపాయ స్థితిలో ఉంటే డాక్టర్నై ఎలారా చూస్తూ ఊరుకోడం'' అంటూ సిజర్స్ తీస్కుని, రక్తం కారుతున్న చోట బామ్మగారి జడపాయలు కత్తిరించి క్లీన్ చేశాడు శ్రావణ్. పోలీసు కేస్ అనగానే అప్పటిదాకా సలహాలిస్తున్న జనం

కాస్తా జారుకున్నారు. వాళ్లతో బాటే ఆటోవాలా కూడా చల్లగా జారుకున్నాడు. వెంటనే కనిపెట్టేసేడు సింహం.

''ఆటో వాడేడ్రా! వాడు తప్పించుకుంటే కేసు మనమీదికొస్తుంది'' అంటూ సింహం హీరో హోండా స్టార్ట్ చేశాడు ఆటోని వెంటాడ్డానికి.

''బామ్మా! రక్తం!'' ఏడుస్తూ కథాకళి ఆడేస్తున్న నానీగాణ్ని సముదాయించడం మరీ కష్టంగా ఉంది. ఇంతలో దేవుళ్లా ఐస్క్రీం బండి వాడు అటువేపొచ్చాడు. ''చూడు బాబూ! వీడికో కప్ ఐస్క్రీం ఇవ్వు''

''కప్పు కాదు చాకోబార్'' ఏడుపు ఆపి కళ్లు తుడుచుకుంటూ అన్నాడు నానీ.

''మా నాయనే. టైం చూసి టెండర్ పెట్టేవు కదరా'' అంటూ వాడికి కాండీబార్ ఇప్పించి బామ్మగారి వేపు తిరిగేడు శ్రావణ్. నాల్గైదు కుట్లు వేసి బామ్మగారి తలకి చక్కగా బ్యాండేజ్ వేశాడు.

నెమ్మదిగా కళ్లు తెరిచేరు బామ్మగారు.

నానీ మళ్లీ తయారు ''బామ్మా ఇంటికెళ్లిపోదాం'' అంటూ.

బామ్మగారు వాడికేసి వింతగా చూసేరు. ''నువ్వెవడివిరా?'' అంటూ.

''అదేంటి బామ్మగారూ! వీడు మీ మనవడు కాదూ!'' ఆశ్చర్యంగా అన్నాడు శ్రావణ్.

''ఐతే నేనెవరు?'' బెడ్ మీంచి లేచి వచ్చి కుర్చీలో శ్రావణ్ ఎదురుగా కూర్చున్నారు బామ్మగారు.

''చంపేశారు. అది నన్నడుగుతున్నారేంటి బామ్మగారూ?''

''నిజంగానే చంపేస్తాను. ఏదో చిన్నకుర్రాడు బామ్మా అంటే నువ్వూ బామ్మా అంటావా? నా వయసెంతనుకున్నావ్?'' కోపంగా ఉరిమేరు బామ్మగారు.


''పోనీ... పిన్నిగారు...'' తడబడ్తూ అన్నాడు శ్రావణ్. బాలాకు మారి కాబోలు గొణుక్కున్నాడు.

''అసలీ వరసలెందుకట. నువ్వెవరో, నేనెవరో! మేడం గారు అన్లేవూ? ఇంతకీ అసలు నేనెవర్ని, నన్నెందుకు ఇక్కడికి తెచ్చేవ్? చెప్పు. నరికేస్తాను'' మళ్లీ ఉరిమేరు.

'చచ్చాంరా బాబూ! ఇలా మాటాడ్తోందేంటి. చంపేస్తా నరికేస్తా అంటూ. ఈవిడెవరో పేరు

## ఐటమ్ గాళ్ సలోని

**ముంబాయి భామ సలోని తెలుగులో హీరోయిన్‌గా ఇప్పుడిప్పుడే గుర్తింపులో కొస్తోంది. 'ఒక ఊరిలో..', 'కోకిల' లాంటి చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు ఐటమ్ గాళ్ అవుతోంది. నాగార్జున 'బాస్' సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌లో డాన్సు చేస్తోంది సలోని. పెద్ద హీరోయిన్లు సైతం ఐటమ్ నంబర్లు చేస్తున్నప్పుడు అప్‌కమింగ్ స్టార్లు చేయడంలో వింతేం వుంటుందిలెండి.**



మోసిన ఫ్యాక్షన్ లీడర్ కాదు కదా' ఒణుకొచ్చింది. అంతలోకే తమాయించుకుంటూ-

''చూడండి. 'బామ్'... 'పిన్'....మేడం గారూ... నరికేంత తప్పు నేనేం చెయ్యలేదు. ఆటోవాడు ర్యాష్‌గా టర్నింగ్ తిప్పడంతో మీరు ఆటోలోంచి పడిపోయారు. తలకి గాయమై రక్తంపోతూంటే డాక్టర్‌గా స్పందించి కుట్లు వేసి కట్లు కట్టేను'' సావధానంగా వివరించేడు, ఏదో తప్పు చేసినవాడు సంజాయిషీ ఇస్తున్నట్టు.

వెంటనే కంగారుగా తల తడుముకున్నారు బామ్మగారు. కింద చూస్తే కత్తిరించిన జడపాయలు..

''అయ్యో! అయ్యో! నా పర్మిషన్ లేకుండా నా జుట్టు కత్తిరించి నా కన్‌సెంటే లేకుండా కుట్లు వేస్తావా? కొంపదీసి నాకు ఆపరేషన్ చేసి బ్రెయిన్ గానీ కొట్టేలేదుకదా'' అనుమానంగా శ్రావణ్‌ని ఎగాదిగా చూసేరు బామ్మగారు ఆవేశపడిపోతూ.

'అసలుంటే కదా కొట్టేడానికి!' కసిగా గొణుక్కున్నాడు శ్రావణ్. హోరి భగవంతుడా. ఉపకారానికి పోతే ఎన్ని చివాట్లు తినాల్సొస్తోంది ఈ ముసలి ఘటం చేతిలో.

''ముందు నేనెవర్నో చెప్పు. నా కన్సెంట్ లేకుండా ఇవన్నీ చేసినందుకు క్రిమినల్ కేసేస్తాను నీ మీద'' చిందులు తొక్కుతున్నారు బామ్మగారు.

'అయ్యబాబోయ్. ఈవిడెవరో క్రిమినల్ లాయర్‌లా ఉంది. లా పాయింట్లు పీకుతోంది. నేనెవర్నంటుందేంటి... బుర్రలోనే 'డేవిడ్సన్' తిరగేశాడు శ్రావణ్.

'ఆ! దొరికింది ఆన్సర్. 'పోస్ట్ ట్రుమాటిక్ అమ్నీషియా'... తలకి దెబ్బతగలడం వల్ల తన గతం మర్చిపోయి నా వర్తమానాన్నీ భవిష్యత్తునీ కలిపి నాశనం చేస్తోందీవిడ'

''బామ్మా! ఇంటికెళ్దాం!'' మళ్లీ నానిగాడు మరిన్ని గమకాలూ సంగతులతో రాగాలాపన చేపట్టేడు.

''అబ్బ! చంపేస్తున్నావు కదరా!'' విసుక్కున్నాడు శ్రావణ్. ఐస్క్రీం బండి వాణ్ని కేకేసి ''చూడు బాబూ! వీడు నోరు తెరిచినప్పుడల్లా ఓ చాకోబార్ కుక్కేయ్. బిల్ సంగతి నాకొదిలెయ్!''

పాచికపారిన ఆనందంలో గుంభనంగా నవ్వుకుంటూ చెట్టాపట్టాలేస్కుని హేపీగా వెళ్లిపోయారు నానీగాడూ బండివాడూ.

''ఏటి? ఏటి? ఈ రకతమేటి? ఈ పెద్దావిడి గోషేటి? ఏట్టైపోతాందిక్కడ!'' గళ్లచొక్కా, పక్కన కుట్లూడిన పాత కాకీ నిక్కరూ, చింపిరి తలా... బుర్ర మీసాలతో ఉరమని పిడుగులా ఎంటరయ్యాడు మరో క్యారెక్టరు.

''నేనెవుర్నో తెల్సా? ఎవుర్ని నేను? నేనెవుర్ని?'' తిప్పి తిప్పి అడుగుతూ తల బొప్పి కట్టించినంత పని చేస్తున్నాడు. మొదట బామ్మగారు, ఇప్పుడితనూ.

''అయ్యో! తానెవరో తెలుసుకోవాలనుకునే ఆత్మజిజ్ఞాసువులంతా నా క్లినిక్‌కే దయుచెయ్యాలా?'' ఏడవలేక నవ్వుతూ చేతులు జోడించేడు శ్రావణ్.

అంతలో వేసవిలో చిరుజల్లులా ఓ నడివయసు స్త్రీ వచ్చి ఆ బుర్రమీసాలతన్ని లాక్కుపోతూ గొణుక్కుంది. ''పాతికేళ్లు హెడ్ కనిస్టీబుగా చేసి సివరికి ప్రెమోసన్ టైంకి ఏదో పిచ్చిపని చేసి సస్పెండయిపోయేడు. అప్పట్నించి ఇదీ వరస''

వాళ్లు వెళ్లగానే తగులుకున్నారు బామ్మగారు. ''ఇప్పుడర్థమైంది. నేను నీ క్లినిక్ ముందరే ఎందుకు పడ్డానో. ఆ ఆటోవాడు నీ క్లినిక్ ముందరే ఏక్సిడెంట్లు చేసి నీకు ఎమర్జెన్సీ కేసులు సప్లయి చేస్తాడు. నువ్వు కట్లూ, కుట్లూ అంటూ ఫీజులు రాబట్టి వాడికి వాటాలిస్తావు. ముక్కలు తరిగి ఆవకాయ పెట్టేస్తా ఇద్దర్నీ, ఏం అనుకున్నావో!'' ఆ మాటల్తో వళ్లంతా ఆవకాయ ఊట పూసినట్టయింది శ్రావణ్‌కి.

''ఛీఛీ! ఇంత చదువు చదివీ ఎంత అవమానం? అదీ ఓ మంచిపనికి ఫలితంగా!

''చూడండి బామ్...పిన్... మేడంగారూ! ఏదో ఏక్సిడెంటయి రక్తంపోయి 'హరీ'మనేలా ఉన్నారని డాక్టర్‌గా ఆదుకుంటే ఇంత నీచమైన ఆరోపణలా? చెక్కుతీసి మాగాయ పెట్టేస్తాను జాగ్రత్త'' హుంకరించేడు తెగించి.

ఆ మాటలు వింటున్న బామ్మగారు నిశ్ట్రాటలా అయిపోయేరు. 'హరీ'...'హరీ'.... 'హరీ'... 'మాగాయ్' 'మాగాయ్'... 'మాగాయ్'.. అవే మాటలు చెవుల్లో మార్మోగుతున్నాయి.

''ఆ! ఇప్పుడు అంతా గుర్తొస్తోంది. మా రెండోవాడు హరి. వాడి పెళ్లానికి మాగాయ పెట్టడం రాదని నేనే జాడీ నిండా పెట్టి వాడికిద్దామని ఆటోలో బయల్దేరేను. అన్నట్టు నా మాగాయ జాడీ ఏదీ? ఓహో! మాగాయ జాడీలు కూడా మాయం చేస్తున్నారా మీరిద్దరూ! ఎండావకాయ పెట్టేస్తా ఇద్దర్నీ'' తొడగొట్టేరు బామ్మగారు ఆవేశంగా.

''ఎవర్నీ ఎవరూ ఆవకాయలూ మాగాయలూ పెట్టుకోవక్కర్లా బామ్మగారూ.. ఇడిగో ఆటోవాలా. ఏదో చిన్న కుర్రాడు. అనుభవం తక్కువ ఆవేశం ఎక్కువ. పెద్దమనసు చేస్కుని క్షమించండి. అతనే మిమ్మల్ని తన ఆటోలో మీ అబ్బాయి గారింట్లో క్షేమంగా దించుతాడు'' ఆటోవాణ్నీ, మాగాయ జాడీతో సహా బామ్మగారికి అప్పజెప్పేడు సింహం.

తనని బామ్మగారన్నందుకు సింహాన్నీ, ఆటో ర్యాష్‌గా నడిపి తన తలకి గాయం చేసినందుకు ఆటోవాణ్నీ దాదాపు దోసావకాయ పెట్టినంత పనే్జేసి నానిగాణ్నీ తీస్కుని తుఫాన్ తీరం దాటినట్టు అదే ఆటోలో వెళ్లిపోయారు బామ్మగారు. తరువాత తెలిసింది దివంగత క్రిమినల్ లాయరు పరాంకుశం గారి భార్యట ఆవిడగారు.

'అందుకే అన్ని రూల్సు మాట్లాడింది. సావాసదోషం మరి' సణుక్కున్నాడు శ్రావణ్.

''నీ ప్రాక్టీసే బావుందోయ్!'' 'ఐస్'లో 'వాటర్' కుక్కుకుంటూ ఐస్క్రీం బండివాడికి రెండొందలూ ఇస్తూ అన్నాడు శ్రావణ్.


★ ★ ★

''కేసులు లేకపోతే మానే తింగర కేసులు పంపించి నా కాసులు వదిలించకు వడ్డీకాసుల వాడా!'' దండం పెట్టుకున్నాడు మర్నాడు క్లినిక్కి వస్తూనే.

దేవుడు కరుణించి లంచ్ టైం దాకా ఏ కేసూ రాలేదు. మధ్యలో శశి వచ్చి తను ఈ

## అక్క కోసం...

**ఆమధ్య భర్తతో గొడవలు పడి విడాకుల వరకూ వెళ్లి మళ్లీ అన్నీ మర్చిపోయి భర్తతో కాపురానికి రెడీ అయిన కరిష్మా కపూర్‌కి ఇప్పుడు సినిమాలు లేవు. బుద్ధిగా కాపురం చేసుకుంటూనే మళ్లీ సినిమాల్లో నటించాలనుకుంటోన్న కరిష్మాకి అవకాశాలిమ్మని ఆమె చెల్లెలు కరీనా కపూర్ తన నిర్మాతలను అడుగుతోందిట. ఆ మాటకొస్తే కరీనాకే సరైన వేషాలు లేవు, ఇంక అక్కకి ఏం దొరుకుతాయట అని సినీజనాల ఉవాచ.**



మధ్యే చూసిన ఓ పోకిరీ సినిమా కథ పూసగుచ్చి వెళ్లిపోయింది.

లంచ్ టైంలో స్కూటీ మీద వచ్చింది ప్రసూన లంచ్ బాక్స్ తీసుకుని.

''ఏంటి శ్రావణ్ అలకలూ! చిన్న పిల్లాడిలా? లంచ్ బాక్స్ వదిలేసి ఒచ్చేశావ్'' టేబిల్ మీద అలవోకగా కూర్చుని ముందుకి వంగి స్పూన్‌తో ఫ్రైడ్ రైస్ తినిపిస్తోంది శ్రావణ్‌కి.

''నువ్వు మాత్రం అలా అనొచ్చా'' గునుస్తూ ఆరగిస్తున్నాడు శ్రావణ్.

అదే టైంలో విలాసంగా జడ ఊపుకుంటూ క్లినిక్‌లోకొచ్చిన శశిరేఖ కెవ్వుమంటూ అరిచింది. ''ఏయ్? ఎవ్వర్నువ్వు? ఏం చేస్తున్నావ్? ఒళ్లో కూర్చుని తినిపించలేకపోయేవా ఇంకా బావుండేది'' జడ ముందుకి వేస్కుని ప్రసూనని ఛెడామడా దులిపేస్తోంది.

''శ్రావణ్.. ఎవరీ అమ్మాయ్.. ఏం మాట్లాడ్తోంది?'' గుడ్లలో నీళ్లు కుక్కుకుంటూ అడిగింది ప్రసూన.

శ్రావణ్‌కి ఏం అర్థం కాలేదు. ''ఏయ్? శశీ? ఏంటా మాటలు. తప్పు కదూ. పైకెళ్లు'' మందలింపుగా అన్నాడు. అరుస్తూ, ఏడుస్తూ వెళ్లిపోయింది శశిరేఖ.

ఐదు నిమిషాల్లో అవతారంగారూ భార్య బిలబిలా దిగేరు.

''ఏంటి డాక్టర్ బాబూ! ఎవరీ పిల్ల?'' అనుమానంగా చూసేడాయన ప్రసూనకేసి.

''అవతారం గారూ ఈమె నా భార్య ప్రసూన. ప్రసూనా.. ఈయనే అవతారంగారనీ..'' అంతే. అగ్గిమీద గుగ్గిలంలా అయిపోతూ సింహంలా సింహం మెడికల్స్‌లో దూరేడాయన సతీసమేతంగా. ఐదు నిమిషాల పాటు థౌజెండ్ వాలా టపాకాయల్లా పేలేరు ఇద్దరూ. సింహం కూడా ఏదో 'మ్యావ్' 'మ్యావ్' మంటున్నాడు పీలగా.

''చూడండి సార్. నా షాప్ డాక్టర్లకివ్వను. దయచేసి ఖాళీ చేసెండి'' సుడిగాలిలా క్లినిక్‌లోకొచ్చి అల్టిమేటం ఇచ్చి పైకెళ్లిపోయేడు అవతారం. 'నిన్నటి దాకా బుద్ధావతారంలా ఉన్నవాడు ఇవాళ నరసింహావతారంలా మారిపోయేడేంటి చెప్మా!' అనుకున్నాడు శ్రావణ్.

## మల్లికా..ఓ మల్లికా!

**రజనీకాంత్ కొత్త సినిమా 'శివాజీ' ఆరంభం నుంచీ ఆసక్తిని పెంచుతూనే వుంది. 'అపరిచితుడు' తర్వాత శంకర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడం, హీరో సుమన్ ఇందులో విలన్‌గా నటించడం లాంటివి ఆకర్షణలైతే మరో అట్రాక్షన్ కూడా తోడయిందిప్పుడు. ఇందులో ఓ స్పెషల్ సాంగ్‌లో బాలీవుడ్ సెక్సీ తార 'మల్లికా షెరావత్' డాన్సు చేస్తోంది. ఈ పాట ఈ సినిమాకి హైలైట్‌గా నిలుస్తుందని తమిళ సినీ వర్గాల కథనం. 'శివాజీ' ఎలాగూ తెలుగులోకి డబ్ అవుతుంది కాబట్టి మనమూ ఈ క్రేజీ డాన్స్‌ని చూస్తామన్నమాట.**



కాస్సేపటికి నొక్కేసిన టూత్‌పేస్ట్‌లా డీలాపడిపోయి వచ్చేడు సింహం.

''ఏరా సింహం? ఏమైందిరా? అవతారం ఎందుకలా మాట్లాడేడు?''

''ఏంటండీ సింహంగారూ? ఆ అమ్మాయి ఎవరు? ఎందుకలా వాగుతోంది'' ముక్కు ఎగబీలుస్తూ అడుగుతోంది ప్రసూన. అప్పటికే ఓ రౌండ్ అయిపోయింది శ్రావణ్‌కి.

''ఒరేయ్! నీకు పెళ్లయిపోయిందని ఎందుకురా ముందే చెప్పలేదు? మీ డాక్టర్స్ ఎలాగూ ముప్పై ఏళ్ల దాకా చేస్కోరు కదా అనుకుని నీకు పెళ్లి కాలేదని అవతారంతో చెప్పేను. వాళ్లమ్మాయికి సరిజోడీవి నువ్వే అనీ అన్నీ నేను మాట్లాడతాననీ భరోసా ఇచ్చేను. దాంతో అడ్వాన్సూ, రెంటూ లేకుండా క్లినిక్‌ని అద్దెకిచ్చేడు. ఇవాళే తెలిసింది మా అందరికీ, నువ్వు పెళ్లయినవాడివని'' దీనంగా అన్నాడు.

''నీకు పెళ్లయిన విషయం అందరి దగ్గరా దాస్తావా? ఇంటికిరా నీ పని చెప్తా'' చెయ్యి అట్లకాడలా ఊపుతూ స్కూటీ స్టార్ట్ చేసి వెళ్లిపోతున్న ప్రసూన వేపు అయోమయంగా చూసేడు డా. శ్రావణ్.

ఆ రాత్రంతా ఆరోపణలూ, వార్నింగులు, ఛాలెంజ్‌లతో బెడ్‌రూం అసెంబ్లీ హాల్‌లా తయారైంది శ్రావణ్ కొంపలో. కావాలని నేనేం దాచలేదని ఎంత మొత్తుకున్నా ఆమె నమ్మలేదు.

కష్టం తర్వాత సుఖం వస్తుందంటారు. మర్నాడే క్లోజ్ ఫ్రెండ్ డా.గణపతి ఫోన్ చేశాడు. ఎప్పుడో ఆర్నెల్ల క్రితం రాసిన పీజీ ఎంట్రెన్స్‌లో కోర్టు గొడవలన్నీ తీరిపోయి ర్యాంకులు డిక్లేర్ చేసేర్ట. తనకి ఏభైయ్యో ర్యాంక్. మంచి సీటే వస్తుంది. 'అమ్మయ్య! ఓ మూడేళ్ల పాటు ప్రభుత్వమే పోషిస్తుంది. బామ్మలకీ, సింహాలకీ, అవతారాలకీ స్వస్తి!' శాంతిగా నిట్టూర్చేడు డా. శ్రావణ్.

★